www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 7 జనవరి 2024
5
తూర్పుగోదావరి



బాబోయ్ కొండచిలువలు

ప్రజాశక్తి - చాగల్లు

మండలంలోని చిక్కాల గ్రామ పరిధిలోని కొవ్వాడ కాలువ పరిసరాల్లో కొండ చిలువలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. గత కొన్ని నెలలుగా ఈ ప్రాంత పొలాల్లో కొండచిలువలు తిరుగుతున్నాయి. దీంతో పొంటపొలాల్లోకి వెళ్లాలంటే రైతులు, వ్యవసాయ కూలీలు భయాందోళనకు గురౌతున్నారు. ఇటీవల కాలంలో ఒక కొండ చిలువను రైతులు చంపారు. అయితే శుక్రవారం మరో కొండ చిలువను హతమార్చినట్లు రైతు ముల్లపూడి అప్పారావు తెలిపారు. స్థానిక గ్రామ సచివాలయం స్పందనలో వినతిపత్రం అందజేసినట్లు చెప్పారు. అటవీశాఖ అధికారులు స్పందించి కొండ చిలువులను పట్టుకుని తమ ప్రాంత రైతులు, కూలీలకు రక్షణ కల్పించాలని కోరారు.


రైతు చేతిలో హతమైన కొండ చిలువ

ఎస్మా ఉన్నా పోరాటం ఆగదు...

ప్రభుత్వ తీరుపై సర్వత్రా విమర్శలు

ప్రజాశక్తి- రాజమ హేంద్రవరం ప్రతినిధి

అంగన్‌వాడీల ఉద్యమంపై సర్కారు ఉక్కుపాదం మోపింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఎస్మా అస్త్రాన్ని ప్రయోగించింది. గత నెల12వ తేదీన ప్రారంభించిన అంగన్‌వాడీలు సమ్మె శనివారంతో 26 రోజులకు చేరుకుంది. అంగన్‌వాడీల సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోగా పూర్తి భిన్నమైన వైఖరిని అవలంభిస్తోంది. 2019 ఎన్నికల ముందు ప్రతిపక్ష నేతగా వైయస్ జగన్‌మోహన్ రెడ్డి తెలంగాణ కంటే అదనపు వేతనం చెల్లిస్తామని, సమస్యలను పరిష్కరిస్తామని హామీలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్లలో ఆ హామీలను పూర్తిగా విస్మరించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు సమ్మె ప్రారంభించారు. గడిచిన 26 రోజులుగా జిల్లాలోని 7 ప్రాజెక్టుల పరిధిలో 1536 మెయిన్, 26 మినీ అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. అంగన్‌వాడీ కేంద్రాల తాళాలను సైతం పగలగొట్టి ప్రభుత్వం అపకీర్తిని మూటగట్టుకొంది. సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు నిర్వహణ బాధ్యతలను అప్పగించినా కేంద్రాల నిర్వహణ సాధ్యం కాలేదు. జిల్లా కలెక్టరు కె. మాధవీలత, జాయింట్ కలెక్టరు తేజ్ భరత్ తదితర ఉన్నతా ధికారులు స్వ యంగా వెళ్లి అంగన్‌వాడీ కేంద్రాల విజిట్ నిర్వహిం చినా ఫలితం లేకపోయిం ది. దీంతో 50 శాతానికి పైగా కేంద్రాలు మూత పడ్డాయి. మరోవైపు ప్రజల నుంచి మద్దతు లభిం చటంతో తెరిచి ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు పిల్లలు, గర్భవతులు రాక పోవటం తో వెలవెలబోతున్నాయి. మాతా, శిశు సంక్షేమ శాఖ సేవలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లడంతో అంగన్ వాడీలు కీలకంగా పనిచేస్తున్నారు. విధులలో భాగంగా ఆరు నెలల పసిబిడ్డ నుంచి మూడేళ్ల పిల్లలకు అదనపు పౌష్టికాహారాన్ని అందజేస్తున్నారు. అంగన్‌వాడీల డిమాండ్‌లలలో ప్రధానమైనవి తెలంగాణ కంటే అందనంగా వేతనాలు పెంచాలి. ఫేస్ యాప్ విధానం రద్దు చేయాలి.పర్యవేక్షణ పేరుతో వేధింపులు ఆపాలి. వైయస్ఆర్ సంపూర్ణపోషణ మెనూ ఛార్జీలు పెంచాలి. గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలి.2017 నుంచి పెండింగ్‌లో ఉన్న టిఏ బిల్లులు వెంటనే విడుదల చేయాలి. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ అమలు చేయాలి.మినీ వర్కర్లకు పదోన్నతులు, రిటైర్‌మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలు పెంచాలి. ఆఖరి వేతనంతో 50 శాతం పెన్షన్ ఇవ్వాలి. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలి. హెల్పర్ల ప్రమోషన్‌ల వయో పరిమితి 50 సంవత్సరములకు పెంచాలి. ప్రమో షన్‌లలో రాజకీయ జోక్యం అరి కట్టాలి.సర్వీసులో ఉండి చనిపోయిన వర్కర్, హెల్పర్ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి.గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని కోరుతున్నారు. ప్రభుత్వం గత నాలుగు వారాల్లో పలు మార్లు చర్చలు జరిపినా సానుకూలంగా స్పందించకపోవటం పాలకుల చిత్తశుద్ధిని దర్పణం పడుతోంది..



ఎస్మా ప్రయోగం అప్రజాస్వామికం : సిపిఎం

అంగన్‌వాడీల సమ్మెపై రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా ప్రయోగించడం అప్రజాస్వామికమని సిపిఎం జిల్లా కమిటి అభిప్రాయపడింది. ఈ మేరకు సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ శనివారం ఓ ప్రకటనను విడుదల చేశారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ముందుగా ప్రభుత్వానికి సమ్మె నోటీసు ఇచ్చి అంగన్‌వాడీలు సమ్మెలోకి వెళ్లారని అన్నారు. 26 రోజులుగా శాంతియుతంగా జరుగుతున్న అంగన్‌వాడీలను ఎస్మా చట్టపరిధిలోకి తీసుకువచ్చి సమ్మెను నిషేధించడం అప్రజాస్వామికమని అన్నారు. సమస్యలను పరిష్కరించకుండా సమ్మె నిషేదిస్తూ, సమ్మె కాలానికి జీతాల్లో కోత విధించడం దుర్మార్గమైనదని అన్నారు. న్యాయబద్ధమైన సమ్మెను నిరంకుశ చర్యల ద్వారా విచ్ఛిన్నం చేయాలనుకోవడం తీవ్ర అభ్యంతరకరమని, కేంద్రంలోని మోడీ అడుగు జాడల్లో జగన్ సర్కార్ వెళ్లి శాంతియుత ఉద్యమాన్ని అణిచివేయాలని చూస్తున్నదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఈ నిరంకుశ చర్యను కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు, పార్టీలు, ప్రజాతంత్ర వాదులు ఖండించాలని, సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలకు అండగా నిలబడాలని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు. తక్షణమే ఎస్మాను ప్రయోగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జిఒ నెంబర్ 2ను రద్దు చేసి, యూనియన్ ప్రతినిధులతో చర్చలు సాగించి సమస్యలను పరిష్కరించాలని అరుణ్ డిమాండ్ చేశారు.

ఆమరణ నిరాహార దీక్షకైనా సిద్ధం



26 రోజులుగా అంగన్‌వాడీలు సమ్మె చేస్తున్నారు. ప్రతిపక్షనేతగా వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలనే అమలు చేసేందుకు ముందుకు రావటంలేదు. అంగన్‌వాడీల సమస్యలను పరిష్కారానికి సానుకూలంగా స్పందించకపోగా బెదిరింపు చర్యలకు పాల్పడటం సిగ్గుచేటు. ఎస్మా ప్రయోగించినా బెదిరేది లేదు. సమస్యలు పరిష్కారం, డిమాండ్‌ల సాధన కోసం ఆమరణ నిరాహార దీక్షకైనా సిద్ధమవుతాము.

- కె.బేబిరాణి, జిల్లా కార్యదర్శి,
అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్

ఎస్మాను ఉపసంహరించుకోవాలి...



అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించమని అనేకసార్లు ప్రభుత్వాన్ని కోరాం. అయినా ఫలితం లేదు. ఎన్నికల ముందు వైసిపి ప్రభుత్వం వాగ్దానం చేసినట్టు తెలంగాణ కంటే అదనంగా జీతం ఇస్తామన్న హామీ అమలుకు నోచుకోలేదు. అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్‌కు ఘనమైన పోరాట చరిత్ర ఉంది. అదే స్ఫూర్తితో ఆందోళనలు మరింత తీవ్రతరం చేస్తాం. తక్షణమే జీవో నెం. రద్దు చేసి ఎస్మా ఉపసంహరించుకోవాలి.

– కె.శారద, రాజమండ్రి ప్రాజెక్టు 1యూనియన్ అధ్యక్షులు


పింఛన్‌ను అందిస్తున్న మంత్రి చెల్లుబోయిన వేణు

అర్హతే ప్రామాణికంగా పథకాలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

అర్హతే ప్రామాణికంగా ప్రతీ పేద వాడికి సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కుతుందని జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి, వైసిపి రాజమహేంద్రవరం రూరల్ కో-ఆర్డినేటర్ చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ అన్నారు. శనివారం రూరల్ మండలం హుకుంపేట గ్రామపంచాయతీ డి మార్ట్ పరిధిలో ఏర్పాటు చేసిన పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల పక్షాన నిలబడిన వ్యక్తి సిఎం జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీని అధికారలోకి వచ్చిన వెంటనే తొలి సంతకం పెన్షన్ ఫైల్‌పై చేశారని తెలిపారు. నెలలో మొదటి తేదీ ఉదయాన్నే లబ్ధిదారులకు పెన్షన్ అందిస్తూ వారి కళ్ళల్లో వెలుగులు నింపుతున్నారన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీలకు చెందిన పేద ప్రజలకు ఆర్థిక భరోసాను కల్పిస్తూ పాలన సాగిస్తున్నారని మంత్రి వెల్లడించారు. రాజమహేంద్రవరం రూరల్ మండలంలో 20, 141 మంది లబ్ధిదారులకు రూ.6 కోట్ల 6 లక్షల 49 వేలను అర్హులైన లబ్ధిదారులందరకు పెన్షన్ పంపిణీ చేస్తున్నామన్నారు. పరిపాలన సౌలభ్యం కోసం సచివాలయం, కలెక్టరేట్, వాలంటరీ వ్యవస్థలను తీసుకువచ్చి మీ గ్రామాల్లోనే అర్హులకు తలుపు తట్టి సంక్షేమ పథకాలను అందజేస్తున్నామని చెప్పారు. రూరల్ మండలంలో పదివేల మందికి అందించే పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొనడం నా అదృష్టంగా భావిస్తున్నానన్నారు. రాష్ట్రంలో అర్హులైన పేద వారందరికీ సంక్షేమ పథకాలను ద్వారా వారి ఆర్థిక స్థితిగతులను పెంచేవిధంగా చేదోడు, ఆసరా, ఫీజు రియంబర్స్మెంట్, జగనన్న చేయూత వంటి పథకాల ప్రయోజనాలను అనేక మంది అర్హులైన పేద ప్రజలందరికీ అందజేస్తున్నామన్నారు. పేద ప్రజల ఆరోగ్య సంరక్షణయే లక్ష్యంగా ఆరోగ్య భరోసాను కల్పిస్తూ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ స్థాయిలో ఖరీదైన వైద్యాన్ని అందజేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఖాదీ బోర్డు వైస్ ఛైర్మన్ పిల్లి నిర్మల, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ముద్దాల అను, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ పికె. రావు, మాజీ ఎంపిపి రేలంగి వీర వెంకట సత్యనారాయణ, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి కెఎం.జ్యోతి, ఎంపిడిఒ డి.శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు తప్పవు

ప్రజాశక్తి - దేవరపల్లి

సంక్రాంతి పేరుతో నిబంధనలకు విరుద్ధంగా కోడి పందాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని తహశీల్దార్ ఎం.రామకృష్ణ హెచ్చరించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో పోలీసు, రెవెన్యూ అధికారులతో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడైనా కోడి పందాలు నిర్వహిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని అన్నారు గ్రామాల్లో ఎక్కడైనా కోడి పందాల బరులు ఏర్పాటు చేస్తే సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో దేవరపల్లి డిఎస్‌పి(శిక్షణ) భానుదయ, ఇతర అధికారులు పాల్గొన్నారు.


రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్‌ఎ

రహదారి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని వడ్లూరులో రూ.1.20 కోట్ల వ్యయంతో రహదారి పనులకు ఎంఎల్ఎ జి.శ్రీనివాస నాయుడు శకుస్థాపన చేధశారు. ఈ సందర్భంగా ఓలుపల్లి సత్యనారాయణ, మీసాల కొండలరావు, మనిపూడి శివ, గుడి వెంకన్న వైసిపిలో చేరారు. వీరికి ఆయన వైసిపి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి అనేది నిరంతరంగా జరుగుతూనే ఉంటుందని, దానిలో భాగంగా ఆర్ అండ్ బి రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రఘుమండ తేజశ్రీ, ఎంపిపి పాలాటి యల్లారీశ్వరి, జడ్‌పిటిసి నందిగం భాస్కర రామయ్య, మండలం జెసిఎస్ ఇన్‌ఛార్జ్ కఠారి సిద్ధార్థ రాజు, ఎంపిటిసి సభ్యులు రఘుమండ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఎండియు వ్యాన్ తనిఖీ

ప్రజాశక్తి - చాగల్లు

స్థానిక ప్రజలకు రేషన్ ఇస్తున్న ఎండియు వ్యాన్‌ను తహశీల్దార్ కె.రాజ్యలక్ష్మి శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి వ్యక్తికి రేషన్ అందించాలన్నారు. ఎక్కడన్నా అక్రమాలకు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అంగన్‌వాడీల 24 గంటల దీక్ష

-న్యాయమైన సమ్మెపై ఎస్మా ప్రయోగం ఉపసంహరించాలి

ప్రజాశక్తి - యంత్రాంగం


తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం గత 26 రోజులుగా చేపట్టిన సమ్మెలో భాగంగా శనివారం 24 గంటల నిరహారదీక్షను అంగన్‌వాడీలు చేపట్టారు. మండల కేంద్రాల్లో యథావిధిగా రిలే నిరహారదీక్ష చేపట్టిన అంగన్‌వాడీలు, జిల్లా కేంద్రాల్లో 24 గంటల నిరహారదీక్షను చేపట్టారు. **రాజమహేంద్రవరం** అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని ప్రారంభించిన నిరవధిక సమ్మెలో భాగంగా శనివారం 24 గంటల నిరహారదీక్షలు ప్రారంభం అయ్యాయి. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద చేపట్టిన ఈ దీక్షను పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ముప్పాళ్ళ సుబ్బారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని 26 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలను ఉద్యోగాలు తీసేస్తామంటూ బెదిరింపులకు పాల్పడటం సరికాదన్నారు. క్షేత్రస్థాయిలో గర్భిణీలకు, బాలింతలకు సేవలందిస్తూ పౌష్టికాహారం అందించడంలో కీలకపాత్ర పోషిస్తున్న అంగన్‌వాడీలకు ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాన్ని అమలు చేయమంటే ప్రభుత్వం ఎందుకు వెనకాడుతుందని ప్రశ్నించారు. అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించకపోతే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. జనసేన పార్టీ అర్బన్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ అను శ్రీ సత్యనారాయణ, నగర అధ్యక్షులు మాట్లాడుతూ అంగన్‌వాడీల పోరాటం న్యాయమైందని, ఎన్నికల ముందు ఓట్లు కోసం తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు ఇస్తానని హామీ ఇచ్చిన జగన్‌కి ముఖ్యమంత్రి అయ్యాక ఆ హామీ గుర్తు లేదా? అని ప్రశ్నించారు. మాట తప్పను మడము తిప్పను అన్న జగన్ అంగన్‌వాడీల హామీని ఎందుకు మడమ తిప్పారని ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రజలకి జగన్ ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని, రానున్న ఎన్నికల్లో జగన్‌కి ఓట్లు అడిగే అర్హత లేదని అన్నారు. వాగ్దానాల్ని అమలు చేయని వారికి తగిరి గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ మాట్లాడుతూ శాంతియుతంగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలపై ఎస్మా చట్టం ప్రయోగించడం ప్రభుత్వం దిగజారుడుతనానికి నిదర్శమని అన్నారు. ఇలాంటి నిర్బంధాలు ఎన్నో చూశామని, తమిళనాడులో గతంలో జయలలిత ప్రభుత్వం ఇలాంటి చర్య చేపట్టే ఉద్యోగులను తొలగించిందని, ఆ తర్వాత వచ్చిన ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడిందని గుర్తు చేశారు. జగన్ ప్రభుత్వం ఇప్పటికైనా బేషిజాలకు పోకుండా అంగన్‌వాడీల న్యాయమైన కోరికలు పరిష్కరించాలని, లేకుంటే రానున్న ఎన్నికల్లో జగన్‌కి తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.బేబీ రాణి మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదని, ఈ ప్రభుత్వం పెట్టే ఎలాంటి నిర్బంధాన్నయినా ఎదుర్కొంటామని, సమస్యలు పరిష్కరించేకే అంగన్‌వాడీ సెంటర్‌కు వెళ్లమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జువ్వల.రాంబాబు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ఎస్.మూర్తి, క్రి రామకృష్ణ, కెఎస్‌వి. రామచంద్రరావు, సిపిఎం నగర కార్యదర్శి బి.పవన్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎన్.రాజా, ఐద్వా నాయకురాలు టి.సావిత్రి, ఇపిఎఫ్ పెన్షనర్స్ జిల్లా అధ్యక్షులు సోమేశ్వరరావు, అంగన్‌దవాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ఆఫీస్ బేరర్స్ మార్త, మాలతి, సునీత, శారదా, రామలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు. **దేవరపల్లి** న్యాయబద్ధంగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగించడం దారుణమని, తక్షణమే ఎస్మాను ఉపసంహరించుకోవాలని సిఐటియు నాయకులు కె.రత్నాజీ డిమాండ్ చేశారు. స్థానికంగా జరుగుతున్న నిరసన దీక్షలో అంగన్‌వాడీలు గడ్డి తింటూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తూ అంగన్‌వాడీల సమ్మెను అణిచివేసేందుకు కుట్రలు చేస్తుందన్నారు. ఎస్మా చట్టాన్ని తక్షణం ఎత్తివేయకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఇ.కాంత్‌కుమారి, కొమ్మిరెడ్డి బాలసుకుమారి, కె.లక్ష్మి, కె.భవాని, ఎం.సంధ్య నాయకత్వం వహించారు. **కడియం** స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద జరుగుతున్న నిరసన దీక్షలో ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నినదించారు. రాజానగరం ప్రాజెక్ట్ లీడర్ వై.సుజాత మాట్లాడుతూ ప్రభుత్వం పూర్తిగా అణచివేతధోరణితో వ్యవహారిస్తుందని, అయినా కోర్కెలు సాధనలో వెనక్కి తగ్గేదిలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు, ఆయాలు పాల్గొన్నారు. **గోపాలపురం** స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద జరుగుతున్న దీక్షలో అంగన్‌వాడీలు ఒంటి కాలిపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షురాలు రామలక్ష్మీ పాల్గొని మాట్లాడారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకుని, అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, లేనిపక్షంలో సమ్మెను విరమించేది లేదని స్పష్టం చేశారు. **చాగల్లు** స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు రిలే నిరహారదీక్షను కొనసాగించారు. విజయవాడలో జరుగుతున్న 24 గంటల దీక్షకు మండలం నుంచి 10 మంది అంగన్‌వాడీలు తరలివెళ్లిరు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పి.విజయ్ కుమారి, కె.లక్ష్మి, కె.దమయంతి, ఎ.శ్రీదేవి, బి.మహాలక్ష్మి, ఎస్.అరుణ్ కుమారి నాయకత్వం వహించారు.


సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద 24 గంటల దీక్షకు మద్దతు పలికిన ముప్పాళ్ల సుబ్బారావు, టి.అరుణ్


గోపాలపురంలో ఒంటి కాలిపై నిలబడి నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు


దేవరపల్లిలో పచ్చగడ్డి తింటూ నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు

కార్టూ'నిజం'




మత్తిచ్చే 'మందు' కొరతలేదుగానీ...
'మత్తు' డాక్టర్లకుమాత్రంకొరతటర!

మానవత్వానికి నిలువుటద్దం 'స్వర్ణాంధ్ర'

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

మానవత్వానికి, నిస్వార్థ సేవకు నిలువుటద్దం 'స్వర్ణాంధ్ర' స్వచ్ఛంద సేవా సంస్థ అని ఎంపి మార్గాని భరత్ రామ్ అన్నారు. శనివారం లాలా చెరువు సమీపంలోని స్వర్ణాంధ్ర స్వచ్ఛంద సేవా సంస్థ రజతోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభ లో ఎంపి భరత్ పాల్గొని సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ గుబ్బల రాంబాబు చేస్తున్న సేవలను కొనియాడారు. కడుపున పుట్టిన బిడ్డలు తల్లిదండ్రులను వృద్ధాప్యంలో కంటికి రెప్పలా చూసుకోవాలన్నారు. పిల్లల ఉన్నతిని నిరంతరం కాంక్షిస్తూ కలలు కనే తల్లిదండ్రులను వృద్ధాప్య దశలో అనాథలుగా రోడ్డున వదిలేయడం ఏ మాత్రం భావ్యం కాదన్నారు. స్వర్ణాంధ్ర రాంబాబు మానవత్వంతో ఎందరో అభాగ్యులు, వృద్ధులు, అనాథలను అక్కున చేర్చుకుని ఆపద్భాధువుడుగా నిలుస్తున్నారని కొనియడారు. సేవాతత్పరతతో మంచి పనులు చేసే స్వర్ణాంధ్రా సంస్థను ఆదరించి, సహకరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎటువంటి స్వార్థం లేకుండా మానవత్వంతో ఒక స్వచ్ఛంద సేవా సంస్థను రెండున్నర దశాబ్దాలుగా నిర్వహచడం సాధారణ విషయం కాదన్నారు. ప్రజల ప్రోత్సాహం, సహకారం ముఖ్యమని అన్నారు. ఎన్నో బృహత్తర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర సేవా సంస్థ నిర్వాహకుడు గుబ్బల రాంబాబు, ఆయన మిత్ర బృందాన్ని ఎంపి భరత్, రుడా ఛైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు తదితర ప్రముఖులు అభినందించారు. అనంతరం వృద్ధులకు రగ్గులు, పలువురు పేద మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నక్కా శ్రీనగేష్, అజ్జరపు వాసు, రెడ్డి, నయనాల కృష్ణారావు, మల్లాడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.


వృద్ధులకు రగ్గులు పంపిణీ చేస్తున్న ఎంపి మార్గాని, రుడా ఛైర్మన్ రౌతు

స్టాక్ వివరాలను బోర్డులో ప్రదర్శించాలి

ప్రజాశక్తి - గోపాలపురం

ప్రతి డీలరు ఎరువులు, పురుగు మందుల స్టాక్ వివరాలు తప్పనిసరిగా బోర్డులో ప్రదర్శించాలని అనపర్తి సహాయ వ్యవసాయ సంచాలకులు డివి.కృష్ణ తెలిపారు. శనివారం మండలంలోని వేలచింతలగూడెం ఎరువులు పురుగుమందులు విత్తనాలు షాపుల అంతర్గత తనిఖీలో భాగంగా అనపర్తి సహాయ వ్యవసాయ సంచాలకులు డివి.కృష్ణ మండలంలోని ఎరువులు షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి డీలరు ప్రతిరోజు వారి వద్ద ఉన్నటువంటి ఎరువులు పురుగుమందులు విత్తనాల స్టాకు వివరాలను తప్పనిసరిగా బోర్డులో నమోదు చేయాలని తెలిపారు. ప్రతి రైతుకు విధిగా బిల్లును ఇవ్వాలని, అదేవిధంగా రైతులు కూడా తప్పనిసరిగా వారు తీసుకున్నటువంటి ఎరువులు, పురుగుమందులు విత్తనాలకు సంబంధించిన బిల్లును విధిగా డీలర్ దగ్గర నుంచి అడిగిమరీ తీసుకోవాలన్నారు. దానివలన భవిష్యత్తులో ఏమైనా ఇబ్బందులు ఉంటే వాటి గురించి అడగటానికి అవకాశం ఉంటుందన్నారు. ఎరువుల విషయంలో తప్పనిసరిగా ఆధార్ కార్డు తీసుకుని వెళ్లి ఈపాస్ మిషన్ ద్వారా బయోమెట్రిక్ వేసి మాత్రమే ఎరువులను పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బి.రాజారావు, తదితరులు పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి

అర్హులందరికీ పింఛన్ సదుపాయం

ప్రజాశక్తి - చాగల్లు

రాష్ట్రంలోని అర్హులందరికీ పింఛన్ సదుపాయాన్ని ఎటువంటి ఇబ్బందులు లేకుండా అందిస్తున్న ఘనత వైసిపి ప్రభుత్వానిదేనని హోంమంత్రి తానేటి వనతి అన్నారు. శనివారం పింఛన్ల పెంపు, కొత్తగా మంజూరైన పింఛన్ల పంపిణీ కార్యమంలో స్థానిక సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంత అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రి పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లను అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చాగల్లు మండలంలోనే నెలకు పింఛన్ల రూపంలో 9,733 మందికి రూ.2 కోట్ల 85 లక్షల 28 వేలను అందిస్తున్నట్లు చెప్పారు. ఇక రాష్ట్రవ్యాప్తంగా పింఛన్లకు ఎంతమొత్తంతో అందచేస్తున్నామో ప్రజలు గ్రహించాలన్నారు. గతంలో ఎవరికైనా కొత్త పెన్షన్ మంజూరు కావాలంటే.. కులం, మతం, పార్టీ చూసి జన్మభూమి కమిటీలు సిఫారసు చేస్తేనే వచ్చేవని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదన్నారు. ప్రతి నెలా మొదటి రోజే అది ఆదివారమైనా, సెలవు దినమైనా మీ గడప ముందుకొచ్చి వాలంటీర్లు వచ్చి ఇస్తున్నారన్నారు. కులం, మతం, ప్రాంతం, పార్టీ చూడకుండా అర్హత ఉన్న ప్రతి వ్యక్తికి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తోందన్నారు. గత పాలనకు, ఈ ప్రభుత్వ పాలనకు మధ్య తేడాలను ప్రజలు గమనించి.. జగనన్న ప్రభుత్వానికి మరొక్క సారి మీ చల్లని దీవెనలతో ఆశీర్వాదించాలని మంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మట్ట వీర స్వామి, ఉపాధ్యక్షులు జోజువరపు రామచంద్రరావు, చెల్లింకుల శ్రీ విజయ, తహశీల్దార్ కె.రాజ్యలక్ష్మి, ఎంపిడిఒ పి.నిర్మలా కుమారి, పంచాయతీ కార్యదర్శి ఎల్. రవికుమార్ పాల్గొన్నారు.


పింఛన్ల సొమ్మును అందిస్తున్న మంత్రి తానేటి వనిత

నేరాలు ఘోరాలు

పేకాట శిబిరాలపై దాడులు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మండలంలోని గ్రామాలలో పేకాట ఆడుతున్నారని సమాచారం రావడం తో ఎస్ఐ బి.వై.కిరణ్ కుమార్ తన సిబ్బందితో శనివారం దాడులు నిర్వహించారు. ఈ దాడులలో నార్కెడిమిల్లి గ్రామంలో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.61,920 స్వాధీన పరుచుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సారా విక్రేత అరెస్ట్

ప్రజాశక్తి-ఆత్రేయపురం

నాటు సారా విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు ఇవి.. రాజవరం గ్రామ శివారు శనివారం నాటు సారా అమ్ముతున్నారని సమాచారం రావడంతో ఎస్ఐ బి.వై.కిరణ్ కుమార్ సిబ్బందితో వెళ్లి నాటు సారా అమ్ముతున్న కొల్లి రవికుమార్ ను అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి ఐదు లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి కొత్తపేట కోర్టు లో ప్రవేశపెట్టగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు ఆయన తెలిపారు.

నాటు సారాతో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - సీతానగరం

సారాను విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ముందస్తుగా వచ్చిన సమాచారంతో శనివారం మండలంలోని ఇనగంటివారి పేటలో సారాను విక్రయిస్తున్న చాకలి చంద్రమోహన్‌ను అరెస్టు చేసి ఒక లీటర్ సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కె.చిరంజీవి చెప్పారు. ఆ వ్యక్తిని కోర్టులో హజరు పర్చగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని వంగలపూడి గ్రామ శివారులో పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. వారి వద్ద నుండి రూ.2860లను స్వాధీనంచేసుకున్నారు. వారిని స్టేషన్ బెయిల్ ఇచ్చి విడుదల చేసినట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

సారా బటీలపై దాడులు

ప్రజాశక్తి - గోపాలపురం

సారా బట్టీలపై దాడులు నిర్వహించి నాటు సారా, బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్ఐ కె. సతీష్ కుమార్ తెలిపారు. మండలంలోని కరగపాడు గ్రామము శివారులో నాటు సారా తయారీ కేంద్రం(బట్టి)పై దాడి చేసినట్లు తెలిపారు. ఈ దాడులలో తయారు చేసిన 40 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, సారా తయారు చేయుటకు నిల్వ చేసిన 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, ఒక వ్యక్తిని అరెస్టు చేసి సారా తయారు చేయుటకు ఉపయోగించిన సామాగ్రిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

మద్యం నిందితుల బైండోవర్

ప్రజాశక్తి - కరప

మండలంలోని అక్రమ బెల్ట్ షాపులు నిర్వహిస్తూ, అదేవిధంగా నాటు సారా తయారు చేస్తున్న 30 మంది నిందితులను మండల మెజిస్ట్రేట్, తహశీల్దార్ పొన్నమండ శ్రీనివాసరావు ఎదుట బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ సిఐ జెవి.భవాని తెలిపారు. బైండోవర్ అయిన నిందుతులంతా సక్రమంగా వ్యవహరించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఎంవివిబి.కుమార్ పాల్గొన్నారు.

813 పింఛన్ల మంజూరు

ప్రజాశక్తి - కడియం

మండల పరిధిలో మొత్తం జనవరి నుంచి కొత్తగా 183 మందికి వైఎస్ఆర్ పింఛన్‌లు మంజూరు అయ్యాయని ఎంపిడిఒ కె.రత్న కుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు స్థానిక జడ్‌పి హైస్కూల్ ప్రాంగణంలో జిల్లా ఇన్‌ఛార్జ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస్ వేణుగోపాల్ కృష్ణ చేతుల మీదుగా లబ్ధిదారులకు అందిస్తామని చెప్పారు. మండల పరిధిలోని 11 గ్రామ పంచాయతీల పరిధిలో 12,142 మందికి సామాజిక భద్రతా పెన్షన్లు అందచేస్తున్నట్లు తెలిపారు. వధ్యాప పెన్షన్ 5488 మందికి, వికలాంగులు 1712 మందికి, వితంతువులు 3610, ఒంటరి మహిళ 279, మత్స్య కార 74 , చర్మకారుల 40, చేనేత 530, డప్పు కళాకారులు 49, కల్లు గీత కార్మికులు 56, అభయ హస్తం 220, ట్రాన్స్‌జెండర్ 4, ఇతర పెన్షన్లు 80 మందికి అందిస్తున్నట్లు చెప్పారు.

నిత్య అన్నదాన సేవకు శ్రీకారం

ప్రజాశక్తి - సీతానగరం

జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ అధ్వర్యంలో అక్షయామృతం నిత్య అన్నదాన సేవల్లో భాగంగా అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ వివిధ ఆరోగ్య కారణాల వల్ల, దినసరి పనుల వల్ల, నిత్యం వేరు వేరు ప్రదేశాలకు ప్రయాణించే వారి కోసం,పేదల కోసం నియోజకవర్గంలో ఏ ఒక్కరూ ఆకలి దప్పికలతో ఉండకూడదనే లక్ష్యంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు.

పెన్షన్ కోసం వచ్చి ...

ప్రజాశక్తి - చాగల్లు

పెన్షన్ ఇచ్చే సభకు తీసుకొచ్చిన ఓ వృద్ధుడి పెన్షన్ తీసుకోకుండానే మృతి చెందాడు. చాగల్లు గ్రామానికి చెందిన ఇమ్మని వీర్రాజు(73) పెన్షన్ ఇస్తారని సమావేశానికి నిర్వాహకులు తీసుకొచ్చారు. అయితే ఆ పెన్షన్ ఇచ్చే ముందు సమావేశం జరగడంతో అక్కడే కూర్చున్నవాడు కూర్చున్నట్లుగానే పడిపోయాడు. వెంటనే స్పందించిన స్థానికులు మంత్రి తానేటి వనితకు చెందిన కాన్వాయ్ వాహనంలో ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే ఆ వృద్ధుడు మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. అదే వాహనంలో ఆ వృద్ధిడి మృతదేహాన్ని అతని ఇంటికి తీసుకెళ్లి వదిలిపెట్టారు. మృతినికి భార్య, కుమారుడు ఉన్నారు.

సమస్యలపై పోరు... ఉద్యమాల హోరు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

సమస్యలపై కార్మిక లోకం పోరు బాట పట్టింది. ఉద్యమాలు చేస్తూ న్యాయం కోసం ఎదురుచూసోంది. మరో పక్క ప్రజా ఉద్యమాలను కట్టడి చేసేందుకు ప్రభుత్వం నానా కుట్రలు పన్నుతోంది. ఎల్లాగైనా అణచి వేయాలనే ధోరణితో చివరికి ఎస్మాను సైతం ప్రయోగించింది. అయినప్పటికీ ఉద్యమాన్ని వీడేది లేదని, సమస్యలను పరిష్కరించి చాల్సిందేనని కార్మిక లోకం ముక్తకంఠంతో స్పష్టం చేస్తోంది. హామీలు అమలు చేయాలంటూ అంగన్‌వాడీలు 26 రోజులుగా సమ్మెలో ఉన్నారు. వారు సమ్మెలో ఉండగా అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు బద్దలు కొట్టించి ప్రభుత్వం అభాసుపాలైంది. అయినప్పటికీ తన బుద్ధిని మార్చుకోకుండా మరో అడుగు ముందుకు వేసి సమ్మెను నిషేధిస్తూ ఎస్మాను ప్రయోగించింది. శాంతియుతంగా జరుగుతున్న ఆందోళనలపై ప్రభుత్వ తీరుపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. గత వారంలో ప్రజా ప్రతినిధుల ఇళ్ల ముట్టడి కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించారు. ప్రజా ప్రతినిధుల ఇళ్లు, కార్యాలయాల వద్దకు వెళ్లి నిరసనలు తెలిపి వినతిపత్రాలను అందజేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. త్వరలోనే తీపికబురు అంటూ ఓ మంత్రి హామీ ఇచ్చినప్పటికీ ఆచరణలో భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. మరోవైపు అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. చిన్నారులకు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహార పంపిణీలో అవాంతరాలు ఎదురవుతున్నాయి. వాలంటీర్లు, సచివాలయ ఉద్యోగులకు ఇతర విధులు ఉండటంతో కేంద్రాల నిర్వహణ భారంగా మారింది. అలాగే విద్యాశాఖలోని సమగ్ర శిక్ష అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులు డిసెంబరు 20న సమ్మెలోకి వెళ్లిన విషయం విధితమే. గడిచిన 16 రోజులుగా వివిధ రూపాలలో తమ నిరసన తెలుపుతున్నారు. వారిపైనా ప్రభుత్వం అణచివేతకు పాల్పడింది. నాయకులను అక్రమ అరెస్టులు చేయించింది. మున్సిపల్ కార్మికులు సైతం సమ్మెలోకి దిగడంతో పట్టణాలు, నగరాల్లోన పారిశుధ్యం క్షీణిస్తోంది. ప్రభుత్వం అలా కాకుండా పోటీ కార్మికులను దింపి సమ్మెను నిర్వీర్యం చేసేందుకు కుట్రలు పన్నింది. కార్మికుల మధ్య గొడవలు సృష్టించాలని చూసింది. దీన్ని కార్మికులు సమర్థవంతంగా ఎదుర్కొన్నారు. ఒక పక్క కరోనా కలవరం మొదలైంది. ఈ సమయంలో పారిశుధ్యంపై దృష్టిసారించాల్సి ఉంది. కార్మికుల సమ్మెతో నానాటికీ పారిశుధ్యం క్షీణిస్తున్నా ప్రభుత్వం మాత్రం తన మొండి వైఖరిని వీడట్లేదు. వారి సమస్యల పరిష్కారానికి ముందుకు రావట్లేదు.

గోదారి గలగలలు

అధికార పార్టీలో సిట్టింగులకు సెగ

మరోపక్క రాజకీయంగాను ప్రకంపనలు చోటుచేసుకుంటున్నాయి. అధికార వైసిపి సిట్టింగులకు సెగ పెట్టడంతో రాజకీయం రంజుగా మారింది. నియోజక వర్గాల వారీగా విడుదల చేసిన సమన్వయ కర్తల జాబితా మరింత మంటలు రేపుతోంది. జిల్లా అధ్యక్షుల పేర్లు సైతం ఖరారు చేయకపోవడంతో ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే సీటు దక్కని సిట్టింగులలో తీవ్ర అసంతృప్తి నెలకొంది. వారు ఇతర పార్టీల వైపు చూడటంతో కేడర్‌లో అయోమయం నెలకొంది. ఇదిలా ఉండగా అధికార పార్టీ ప్రచార యావ మరింత పతాక స్థాయికి చేరింది. ఇప్పటికే పట్టాదారు పాస్‌పుస్తకాలపైనా, ధృవీకరణ పత్రాలపైనా జగన్ ఫోటోలతో ముద్రించడం విమర్శలకు దారి తీసింది. తాజాగా సామాజిక పింఛన్లను సైతం రాజకీయానికి వాడుకుంది. ఒకటో తేదీన ఇవ్వాల్సిన పింఛను ప్రభుత్వ తీరుతో ఏడు తేదీన అందుకోవడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. మరోవైపు జనసేనాని పవన్ కళ్యాణ్ ఉమ్మడి జిల్లాపై దృష్టి సారించారు. ఈ మేరకు నియోజకవర్గాల వారీగా సమీక్షలు చేశారు.

కొండ దిగనంటున్న కూరగాయలు

కూరగాయల ధరలు కొండ దిగనంటున్నాయి. కార్తీక మాసం దాటినా ధరలు పేలుతున్నాయి. బహిరంగ మార్కెట్లో టమోటా రూ.50 చొప్పున, కిలో మిర్చి రూ.80 చొప్పున, చిక్కుడు కాయలు సైతం కిలో రూ.100 మార్క్ దిగిరానంటున్నాయి. మరోవైపు బియ్యం ధరలూ పెరగటంతో సామాన్యులకు కంటి మీద కునుకు కరువైంది. తుఫాను నేపధ్యంలో తాజాగా కూరగాయల తోటలకు పంటనష్టం వాటిల్లిన విషయం విధితమే. దీంతో మరి కొన్ని రోజులపాటు ఈ ధరలు నేలను తాకే అవకాశం లేదని వ్యాపారులు అభిప్రాయ పడుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా చొరవ చూపి ధరలు అందుబాటులోకి వచ్చేలా చర్యలు చేపట్టాలని కొనుగోలు దారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కొనసాగిన ఎస్ఎస్ఏ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగుల నిరసన శనివారం నాటికి 18వ రోజుకు చేరింది. స్థానిక డిఇఒ కార్యాలయం వద్ద జరుగుతున్న నిరవధిక రిలే నిరాహారదీక్షలో సమగ్ర శిక్షలో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను విద్యాశాఖలోకి విలీనం చేసి, రెగ్యులర్ చేయాలని, హెచ్ఆర్.పాలసీ అమలు చేయాలనే న్యాయమైన హామీలకే వరకు సమ్మె విరమించేది లేదని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 5 తేదీన నిర్వహించిన చలో విజయవాడ కార్యక్రమం విజయవంతం చేసినందుకు యూనియన్ నేతలు కృతజ్ఞతలు తెలిపారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు కోరుతున్న న్యాయపరమైన డిమాండ్లు సాధించే వరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని జెఎసి నాయకులు ఎమ్.రమణారెడ్డి, డి.వంశీకృష్ణరాజు, పి.దుర్గా ప్రసాద్, ఎస్.వెంకట్రావు, మిరపరాజు, వెంకట్ తదితరులు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సమగ్రశిక్ష ఉద్యోగులు మల్లికార్జునరావు, శ్రీనివాస్, జి.చిన్నబాబు, బేబి, శ్రీదేవి, సత్యమణి, శివకుమార్, తులసి, సరస్వతి, వరలక్ష్మి, వీరరాఘవులు, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కార్టూన్ల ప్రదర్శన

ప్రజాశక్తి - రాజానగరం


కార్టూన్లను తిలకిస్తున్న విద్యార్థినులు

గైట్ కళాశాలలో జరుగుతున్న అంతర్జాతీయ తెలుగు మహాసభల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన వ్యంగ్య చిత్రకారులు ప్రదర్శించిన కార్టూన్లు విశేషంగా ఆకట్టుకున్నాయి. తెలుగు భాసా వైభవం, సాంప్రదాయాలు, కట్టుబాట్లు వంటి పలు అంశాలను స్పృశిస్తూ 78 మంది కార్టునిస్టులు 150కి పైగా చిత్రాలను సందేశాత్మక, హాస్యాన్ని మేళవిస్తూ చిత్రించడం విశేషం. ఈ ప్రదర్శనలో పాల్గొన్న కార్టునిస్టుల ప్రతిభను నిర్వాహకులు చైతన్యరాజు, గజల్ శ్రీనివస్ అభినందించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహణ బాధ్యతల్ని ప్రముఖ కార్టూనిస్టులు శేఖర్, నాగేశ్వరం, హరికృష్ణ, గుత్తుల శ్రీనివాసరావు, పద్మ, నాగిశెట్టి సరసి, బాబి, లక్ష్మణ్, డక్కన్ క్రానికల్ కార్టూన్ ఎడిటర్ సుభాని సమర్థవంతంగా నిర్వహించారు.

తెలుగు భాష సజీవం


తెలుగు మహాసభల్లో నృత్యాన్ని చేస్తున్న విద్యార్థినులు

హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి భవానీప్రసాద్

ప్రజాశక్తి - రాజానగరం

తెలుగు బాష సజీవంగానే ఉంటుందని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ గ్రంధి భవానీ ప్రసాద్ అన్నారు. ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో గైట్ ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న త్రిదిన అంతర్జాతీయ తెలుగు మహాసభ రాజరాజ నరేంద్ర వేదికపై శనివారం 'పత్రికా సాహిత్య సదస్సు'ను నిర్వహించారు. ఈ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలుగు పత్రికలను కొని చదివి ప్రోత్సహించాలన్నారు. తెలుగు నేర్చుకోవడమే కాకుండా రాయడం, మాట్లాడటాన్ని విస్తతంగా అలవాటు చేసుకోవాలన్నారు. తద్వారా తెలుగు జాతికి కీర్తి పెంచాలని సూచించారు. వివిధ పత్రికల సంపాదకులు, సహ సంపాదకులు తదితరులు ఈ సదస్సులో పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

అంతర్జాతీయ తెలుగు మహాసభలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరిస్తున్నాయి. ఘంటశాల రవికుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన నృత్యరూపకాలు ఆకట్టుకున్నాయి. అనంతరం చైతన్య రాజు అధ్యక్షతన గజల్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన సభలో తెలుగు సంస్కృత అకాడమీ చైర్మన్ డాక్టర్ లక్ష్మీపార్వతి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. భావితరాలకు మన సంస్కృతి తెలుసుకోడానికి అంతర్జాతీయ తెలుగు మహాసభ దోహదం చేస్తుందన్నారు. ఎంపీ భరత్ మాట్లాడుతూ తెలుగు విశిష్టతను తెలిసే విధంగా ఈ సభ ఉందన్నారు.. గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సిహెచ్ మానవేంద్రరాయ్, రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, బసవరాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం సినీ నటుడు గౌతంరాజు, కవి భాస్కరభట్ల రవికుమార్ తదితరులకు పురస్కారాలు అందించారు.

తెలుగు మమకార భాష కావాలి : వరప్రసాదరెడ్డి

తెలుగు అధికార భాష అంటున్నారని నిజానికి మమకార భాష కావాలని శాంతా వసంత ట్రస్ట్ వ్యవస్థాపకులు పద్మభూషణ్ డాక్టర్ కెఐ.వరప్రసాదరెడ్డి అన్నారు. కృతజ్ఞతాంజలి సభలో ఆయన మాట్లాడారు. ఏ జాతి ఔన్నత్యమైనా భాష, సంస్కృతి, సంప్రదాయాలపై ఆధారపడి ఉంటుందన్నారు.

సీతమ్మ స్ఫూర్తితో అన్నదానం

ప్రజాశక్తి - సీతానగరం


అన్నదానం చేస్తున్న తోట పవన్

డొక్కా సీతమ్మ ఆశయ సాధనతో అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు జనసేన పార్టీ యువ నాయకుడు తోట పవన్ కుమార్ అన్నారు. శనివారం సీతానగరం బస్టాండ్ వద్ద నిత్యాన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పవన్‌కుమార్ మాట్లాడుతూ రాజకీయాలకు, కుల, మత, వర్గ, పార్టీలకు అతీతంగా జరుగుతున్న ఈ అన్నదాన కార్యక్రమం ప్రతిరోజు మధ్యాహ్నం రాజానగరం, సీతానగరం మరియు కోరుకొండ బస్టాండ్‌ల వద్ద నిర్వహిస్తామని చెప్పారు. ఆసుపత్రికి, దినసరి పని కోసమో, వివిధ ఆరోగ్య పరీక్షల కోసమో, ఇతర పనుల కొరకు గానీ వచ్చిన, పేదలకు , ప్రయాణికులకు, బాటసారులకు, వృద్ధులు, బిక్షాటన చేసుకునే వారికి ఇలా ఆకలితో వచ్చిన వందలాదిమంది ఈ అన్నదాన కార్యక్రమంలో తృప్తిగా భోజనం చేయడం జరిగిందన్నారు. డొక్కా సీతమ్మ, పవన్ కళ్యాణ్ ఆశయ సాధనలో అన్నదానం చేయడం జరుగుతుందన్నారు. రాజానగరం జనసేన పార్టీ ఇన్‌ఛార్జ్ బత్తుల బలరామకృష్ణ చొరవతో ఈ కార్యక్రమాన్ని తలపెట్టినట్లు తెలిపారు. ఆదివారం యథావిధిగా మూడు మండలాల్లో అన్నదాన కార్యక్రమం జరుగుతాదని తెలిపారు. అనంతరం మండలంలోని పలు కుటుంబాలకు చెందిన వారిని ఆయన పరామర్శించారు.

నూతన పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

రూరల్ మండలం ధవళేశ్వరంలోని 3వ సచివాలయం పరిధిలో వైసిపి నాయకుల చేతుల మీదుగా వృద్ధాప్య పింఛన్లను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రూరల్ మండల వైసిపి ప్రధాన కార్యదర్శి శ్రీరంగం. బాలరాజు, సచివాలయం ఫోర్ కన్వీనర్ గూటం.రాజు మాట్లాడుతూ తమ నాయకుడు ఇచ్చిన మాట ప్రకారం అంచెలంచెలుగా రూ.3 వేలకు పింఛన్‌ను పెంపుదల చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో వాలంటరీ బేసిదేవి, ప్రియాంక, సుమతి, బాలు తదితరులు పాల్గొన్నారు.

'పడాల'ది నిబద్ధతతో కూడిన జీవితం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కర్రి రామారెడ్డి

సాహితీవేత్తగా, ఉద్యమకారునిగా పడాల రామారావు నిబద్ధతతో జీవించారని ఎపి పాఠశాల విద్యా నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ ఛైర్మన్, ఎపి విశ్రాంత న్యాయమూర్తి ఆశపు రామలింగేశ్వరరావు అన్నారు. శనివారం వీరేశలింగం ఆస్తిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కేంద్ర సాహిత్య అకాడమీ, ఎపి అభ్యుదయ రచయితల సంఘం (అరసం) తూర్పుగోదావరి జిల్లా శాఖ ఆధ్వర్యంలో పడాల రామారావు శతజయం తోత్సవాల సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్య మకారునుగా అరెస్టయి కడలూరు జైలులో ఉన్నా రచన వ్యాసాంగం వదలలేదన్నారు. ప్రస్తుత సమకాలీన పరిస్థితులలో ఆలోచన కలిగిన వ్యక్తులుగా జీవించాలంటే పడాల వంటి వారిపై అధ్యాయనం చేయాలన్నారు. పడాల రామారావు సామాన్యుని జీవితాన్ని, బాధలను, ఆవేదనాలను శోధించి పాంకులకు అందించారని తెలిపారు. సభకు కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు సలహా మండలి సభ్యుడు మందలపర్తి కిషోర్ మాట్లాడుతూ శతాధికా శతాధి గ్రంధకర్త పడాల రామా రావు కఠినమైన సాహిత్యాన్ని సరళీకరించి పాఠకులలో పఠనాసక్తి పెంచిన రచయిత అని కొనియాడారు. పడాల వ్రాసిన శివకన్య నవల నేటితరం చదవాలని అన్నారు. అరసం గౌరవాధ్యక్షులు డాక్టర్ కర్రి రామారెడ్డి మాట్లాడుతూ సమాజానికి అంకితమైన వారిలో పడాల రామారావు ప్రథమ స్థానంలో ఉంటారని, ఆరవ తరగతి వరకు చదువుకున్న అనేక భాషలు నేర్చుకుని అనేక గ్రంథాలను రాశారని గుర్తు చేశారు. నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి వామపక్ష భావాలతో ఉద్యమాలకు అంకితమై ఎన్నో అవకాశాలు వచ్చిన పడాల కాలదన్నేరని అన్నారు.

పలువురిని పరామర్శించిన మద్దిపాటి

ప్రజాశక్తి - గోపాలపురం


పల్లోతు సోదరులను పరామర్శిస్తున్న సోమరాజు

మండలంలోని వెదుళ్ళకుంట గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు పల్లోతు సోమరాజు ఇటీవల అనారోగ్యం తో అకాల మృతి చెందారు. దీంతో వారి కుమారులైన టిడిపి నాయకులు శ్రీనివాస్, ఆనంద రావులను ఆయన శనివారం పరామర్శించారు. సోమరాజు మృతి చెందడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు యంత్రప్రగడ మంగారావు, జొన్నలగడ్డ ప్రసాద్, జ్యేష్ఠ శ్రీనివాస్, వడ్లమూడి రమేష్, రొంగల సత్యనారాయణ, జ్యేష్ఠ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రామిక భవనం నిర్మాణానికి శంకుస్థాపన


శ్రామిక భవనం నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎంపి మార్గాని భరత్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం నగరంలోని క్వారీ మార్కెట్ సెంటర్లో శ్రామిక భవనం నిర్మాణానికి ఎంపి మార్గాని భరత్ రామ్ శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో నిర్మించబోయే వైఎస్ఆర్ శ్రామిక భవనం దేశంలోనే ఎక్కడా లేని అద్భుత కట్టడం కాబోతోందని అన్నారు. దేశ ప్రజలందరికీ పార్లమెంటు దేవాలయం వంటిదని, శ్రామికులకు దేవాలయం మాదిరిగా ఉండాలనే భావనతో పార్లమెంటు భవన నమూనాలో శ్రామిక భవనాన్ని నిర్మించబోతున్నట్టు చెప్పారు. భవనంపై రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ నిలువెత్తు విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఈ భవనం శ్రామిక లోకానికి అన్ని రకాలుగా ఉపయోగపడుతుందన్నారు. వివిధ రంగాలకు చెందిన శ్రామికులు ఇక్కడ సభలు, సమావేశాలు, ఉత్సవాలు, శుభ కార్యాలు ఉచితంగా చేసుకునే విధంగా అన్ని సౌకర్యాలు కల్పించబోతు న్నామని తెలిపారు. ఈ భవన నిర్మాణానికి తన ఎంపి నిధుల నుంచి కోటి రూపాయలు మంజూరు చేస్తున్నానని, భవన నిర్మాణానికి నగర పాలక సంస్థ 25 సెంట్లు భూమిని కేటాయించిందని, అయితే తన కోరిక మేరకు మరో 10 సెంట్లు భూమిని ఇచ్చేందుకు నగర పాలక సంస్థ అధికారులు అంగీకరించినట్లు చెప్పారు. 35 సెంట్లు భూమిలో అధునాతమైన భవనాన్ని నిర్మించినున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్ రెడ్డి, రుడా ఛైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, కాంగ్రెఉస్ పార్టీ నాయకులు అజ్జరపు వాసు, నక్కా శ్రీనగేష్, ఎన్‌వి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రకటన

మహారాజశ్రీ గౌరవ సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టు : పిఠాపురం

I.A. 1440/2015 in I.A. 1040/2016 in O.S. 73/2004

Between:
విప్పర్తి వెంకట సూర్య బాపిరాజు & అదర్స్ ...పిటీషనర్స్
మరియు
విప్పర్తి ప్రసాద్ (డైడ్) & అదర్స్...రెస్పాండెంట్స్

టు:
7వ రెస్పాండెంట్ :
విప్పర్తి ఉమామహేశ్వరి,
W/o. పేర్రాజు, వయస్సు 64 సం॥రంలు,
గృహిణి, డో.నెం.9-4-97రు,
M.R.O. ఆఫీసు ఎదురుగా, పిఠాపురం.
8వ రెస్పాండెంట్ :
పైడిపల్లి వీరభద్ర భ్రమరాంబ,
W/o.సూర్యనారాయణ, వయస్సు 28 సం॥రంలు,
దుళ్ళ, అనపర్తి మండలం.

పై నెంబరు ఫైనల్ డిక్రీ పిటీషన్‌లో శ్రీ కోర్టువారు ఉత్తర్వుల ప్రకారం 7వ మరియు 8వ రెస్పాండెంట్లు అయిన మీకు ఎన్నిపర్యాయములు నోటీసులు పంపిననూ మీకు నోటీసు సర్వ్ కాకపోవటం వల్ల శ్రీ కోర్టువారు **ది. 11-01-2024 సం॥రం తేదీన ఉదయం గం. 10-30 ని॥లకు** పై కోర్టువారి ఎదుట స్వయంగా గానీ, న్యాయవాది ద్వారా గానీ హాజరు కావలయును. అట్లు కాని యెడల పిటీషన్‌ను మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియపరచడమైనది.

// కోర్టువారి అనుమతితో //
రెడ్డిపల్లి సీతన్న
కడిమిశెట్టి నారాయణరెడ్డి, అడ్వకేట్స్
పిఠాపురం.
పిఠాపురం
ది.06-01-2024
సెల్: 9848562162

పారిశుధ్య పనుల నిర్వహణకు ఏర్పాట్లు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

పారిశుధ్య అవుట్ సోర్సింగ్ కార్మికుల సమ్మె దృష్ట్యా ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ కె.దినేష్ కుమార్ తెలిపారు. ఆరోగ్య విభాగం అధికారులు, సిబ్బందితో నగరంలో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరపాలక సంస్థలో పనిచేస్తున్న 742 మంది అవుట్ సోర్సింగ్ కార్మికులు, 42 మంది డ్రైవర్లు సమ్మెలో పాల్గొంటున్నారని, అయినప్పటికి అందు బాటులో ఉన్న శాశ్వత సిబ్బందితో పారిశుద్ధ్య కార్య క్రమాల నిర్వహణకు పక్కా ఏర్పాట్లు చేయటం జరిగిందన్నారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చూస్తు న్నామని వెల్లడించారు. ఎక్కడ ఏ సమస్య వచ్చినా వెంటనే చర్యలు తీసుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎప్పటికప్పుడు పరిస్థితిని అంచనా వేస్తూ తదనుగుణంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ పర్యటనలో ఎంహెచ్ఒ డాక్టర్ ఎ.వినూత్న, శానిటరీ సూపర్‌వైజర్ ఐ.శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి విజయానికి కృషి చేయాలి

ప్రజాశక్తి - గోకవరం


సమావేశంలో మాట్లాడుతున్న రాంజీ

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి విజయానికి సమిష్టిగా కృషి చేయాలని వైసిపి యువ నాయకుడు తోట రాంజీ అన్నారు. మండలంలోని మల్లవరంలో వైస్ ఎంపిపి గోకాడ చిట్టిబాబు ఆధ్వర్యంలో శనివారం వైసీపీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాంజీ మాట్లాడుతూ వైసిపి కార్యకర్తలు ఎటువంటి ఘర్షణలకు తావులేకుండా ఐక్యంగా పార్టీ ప్రకటించిన అభ్యర్థి విజయానికి కృషి చేయాలన్నారు. టిడిపి, జనసేన కూటమి వైసిపిని ఓడించేందుకు కుట్రలు సాగిస్తుందని, కార్యకర్తలు జాగ్రత్తగా ఈ కుట్రలను తిప్పికొట్టాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశానికి తన తండ్రి తోట నరసింహం రావా ల్సివుందని, అయితే అనివార్య కారణాల వల్ల రాలేకపోయారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు సుంకర వీరబాబు, గుల్లా ఏడుకొండలు, పాటి రాంబాబు, సమ్మిటి నాని, పల్లెల నాగబాబు పాల్గొన్నారు.

పాఠశాలకు ఇంకు ఫిల్లింగ్ మిషన్ అందజేత

ప్రజాశక్తి - తాళ్లపూడి


హెచ్ఎంకు ఇంకు మిషన్‌ను అందిస్తున్న వెంకటేశ్వరరావు

మండలంలోని రావూరుపాడు గ్రామంలో ఎంపిపి పాఠశాల విద్యార్థుల కోసం రూ.30 వేలు విలువ చేసే ఇంకు ఫిల్లింగ్ మిషన్‌ను పూర్వ విద్యార్థి, ఫైనాన్స్ వ్యాపారి దంగుడుబియ్యం వెంకటేశ్వరరావు అందచేశారు. తాను చదువుకున్న పాఠశాల విద్యార్థులకు ఏదో రూపంలో ఉపయోగపడాలన్నా ఆలోచనతో విద్యార్థులకు ఉపయోగపడతాదనే ఆలోచనతో ఇంకు ఫిల్లింగ్ మిషన్‌ను శనివారం పాఠశాల హెచ్ఎం పి. వెంకట కృష్ణమోహన్‌కు అందజేశారు. హెచ్ఎం కృష్ణమోహన్ పూర్వ విద్యార్థి వెంకటేశ్వరరావును అభినందించారు. ఈ కార్యక్రమంలోఉపాధ్యాయులు జె. పాపారావు, నాగజ్యోతి విద్యార్థులు పాల్గొన్నారు.

అందరికీ సంక్షేమ పథకాలు


పింఛన్‌ను అందిస్తున్న మంత్రి వనిత

ప్రజాశక్తి - తాళ్లపూడి

కుల, మతాలకు అతీతంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని హోంమంత్రి తానేటి వనిత అన్నారు. మండలంలోని బల్లిపాడు గ్రామంలోని సినీ నిర్మాత డివివి.దానయ్య ఎస్టేట్‌లో శనివారం పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో పింఛన్ల కోసం ఎదురుచూపులు చూడాల్సివచ్చేదని, తమ ప్రభుత్వ పాలనలో ఇంటికే పథకాలను అందిస్తున్నామని అన్నారు. ఎంపిపి జొన్నకూటి పోసిరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జడ్‌పి వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, మండల వైసిపి అధ్యక్షుడు కాకర్ల వెంకటేశ్వరరావు, నాయకులు నాని, దమయంతి, ఎంపిడిఒ రమణ, తహశీల్దార్ రాధిక పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ ట్రేడ్ యూనియన్ ముద్రించిన క్యాలెండర్, డైరీని మంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కలల వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి జి.సతీష్, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీజనార్ధన స్వామిని దర్శించుకున్న మంత్రి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్


పూజలు చేస్తున్న మంత్రి చెల్లుబోయిన

జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ శనివారం రూరల్ మండలం ధవళేశ్వరం లోని లక్ష్మీ జనార్ధన స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రికి అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి వేదమంత్రాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ జిల్లా, రాష్ట్ర ప్రజలందరూ సుఖ: సంతోషాలతో ఆయురా రోగ్య ఐశ్వర్యాలతో జీవించాలని ప్రార్థించినట్లు చెప్పారు. మంత్రి వెంట స్థానిక నాయకులు,పాల్గొన్నారు.

రామచంద్రపురం పురపాలక సంఘం

ఆర్.ఓ.సి. నెం. 24/23-ఇ1 తేది.06-01-2024

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు

రామచంద్రపురం పురపాలక సంఘం నందు పురపాలక సంఘ సాధారణ నిధులు మరియు 15వ ఆర్థిక సంఘం నిధులు నుండి 11 పనులు గాను రూ. 45.11 లక్షల అంచనాలతో టెండర్లు పిలువబడినవి.

టెండర్ బిడ్ డౌన్ లోడ్ ప్రారంభ తేది: **06-01-2024 సా॥ గం॥ 5.00ల నుండి**
ముగింపు తేది. **17-01-2024 సా॥ గం॥ 4.00 వరకు**

మిగిలిన వివరములు http://tender.apeprocurement.gov.in వెబ్‌సైట్‌లో చూడగలరు.

సం/- **కె.శ్రీకాంత్ రెడ్డి**
కమిషనరు, రామచంద్రపురం మున్సిపాలిటీ

IN THE COURT OF THE A.P. CO-OPERATIVE TRIBUNAL AT VIJAYAWADA
O.P. NO. 02/2023

Between :
The Mithra Multipurpose Mutually Aided Co-Operative Society Limited ... Petitioner
AND
R-1) Kothapalli Satyavathi,
W/o Satyanarayana Murthy
R-13) Kothapalli Satyanarayana Murthy,
S/o Chinnaveeranna
D.No. 2-108, New No.2-224, Durgamma Temple Street, Burrilanka Village, Kadiam Mandal, East Godavari District - 533125
.... R1 & R3

పై నెంబరు గల ఓ.పి.లో పిటీషనరు అయినటువంటి సొసైటీవారు రెస్పాండెంట్స్ అయినటువంటి మీపై రావలసిన బాకీ నిమిత్తం సదరు పై కోర్టులో ఓ.పి. వేసియున్నారు. సదరు శ్రీ కోర్టువారు ఎన్ని సమన్లు పంపిననూ అందుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టువారు పేపరు పబ్లికేషన్‌కు ఉత్తర్వులు జారీ చేసియున్నారు. కావున మీరు ది. 30-01-2024 వ తేదీన ఉదయం 10-30 గం.లకు శ్రీ కోర్టువారి యెదుట స్వయంగా గానీ, లేదా ప్లీడరుగారి ద్వారా గానీ హాజరై ఏమైనా ఆక్షేపణలు ఉన్నయెడల తెలుపుకొనగలరు. లేనిచో పై నెంబరు గల పిటీషను మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

వాయిదాతేది : ది.30-01-2024

ఎం.పరమేశ్వరరావు,
అడ్వకేట్,
కాటూరివారివీధి, మాచవరం డౌన్,
విజయవాడ-4. సెల్ : 9390606066